అధ్యక్షా..



- నేటి నుంచే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- సభలో నియోజకవర్గ సమస్యల ప్రస్తావనకు సిద్ధమైన జిల్లా ఎమ్మెల్యేలు
- ఇప్పటికే ప్రశ్నోత్తరాలతోపాటు సమస్యల అంశాలు అందజేత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో సమస్యలను ఏకరువు పెట్టేందుకు జిల్లా ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని, ప్రజలను వేధిస్తున్న పలు కీలక సమస్యలు, అంశాలపై సభలో ప్రశ్నలు లేవనెత్తేందుకు సమాయత్తమయ్యారు. గత ప్రభుత్వంలో ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేసిన ప్రతిపాదనలు, అక్రమాలు, ఎన్నికల సమయంలోను ఇచ్చిన హామీలు నెరవేర్చేలా సభలో ప్రశ్నించడానికి ఎమ్మెల్యేలు సమాయత్తమయ్యారు. అటు ప్రశ్నోత్తరాలకు, సభలో ప్రస్తావించనున్న అంశాలకు సంబంధించి ఇప్పటికే శాసనసభ కార్యాలయానికి వివరాలు కూడా పంపించారు. ఈ మేరకు సభలో ప్రశ్నించాల్సిన, ప్రస్తావించాల్సిన జాబితాలు సిద్ధం చేసుకున్నారు. గురువారం నుంచి దాదాపు పదిరోజులపాటు జరగనున్న సమావేశాల్లో నియోజకవర్గాలకు కావలసిన నిధులు, పలు పనులకు అనుమతులు సాధించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా గత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు చాలా వరకూ అమలులోకి రావడంతోపాటు, అభివృద్ధి సంక్షేమాలతో జిల్లా ప్రజలు ముందుకు వెళుతుండడంతో ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారు. మరింత సంతృప్తికోసం, పలు ప్రజలకు ఉపయోగపడే పలు విషయాలను కూడా అసెంబ్లీలో ప్రస్తావించడానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంపుకోసం.. మంత్రి కందుల

జిల్లాలో వరి పంట ఎక్కువ. అందువల్ల రైతు పండించిన ధాన్యానికి సరైన మార్కెట్ ఉండాలి. దానికోసం జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంపు అవసరాన్ని సభ దృష్టికి తీసుకువెళతా. దానివల్ల రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులుండవు. ఇక ఎర్రకాలువ మోడరైజేషన్ పనులు వెంటనే చేయవలసిన అవసరం గురించి కూడా మాట్లాడతాను. జిల్లాలో టూరిజం ప్రాజెక్టు పనులు వేగవంతం గురించి కోరతాను.

చేనేత కార్మికులను ఆదుకోవడం కోసం.. ఎమ్మెల్యే గోరంట్ల

చేనేత కార్మికులు సమస్యలతో ఉన్నారు. నా దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చారు. ప్రత్యేక కార్పొరేషన్ కోసం కూడా అడిగారు. ఇవన్నీ సభ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తా. టిడ్కో ఇళ్ల అప్పగింత, వైసీపీ ప్రభుత్వం లబ్ధిదార్ల పేరిట రుణాలు తీసుకుంటే, వాటికి వాయిదాలు లబ్ధిదారులు కట్టాల్సివస్తోంది. వీటిని ప్రస్తావిస్తా.

సొసైటీల చట్టంలోని లోపాలు చర్చిస్తా.. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

1999 మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీల చట్టంలోని లోపాల వల్ల జయలక్ష్మి సొసైటీ వంటి అనేక సొసైటీలు ఖాతాదార్లను, డిపాజిటర్లను మోసం చేస్తున్నాయి. ఈ చట్టంలో లోపాలు సవరణ గురించి సభ దృష్టికి తీసుకుని వెళతా. టిడ్కో గృహాలను లబ్ధిదార్లకు వెంటనే అందివ్వాలని కోరతా. ముఖ్యంగా మహిళా అభివృద్ధి చైల్డ్ వెల్ఫేర్‌కు సంబంధించి 2005 నుంచి అమలులో ఉన్న కొత్త బాలికా సంరక్షణ పథకం పరిస్థితి ఏంటి, ఎంతమంది లబ్ధిదారులు, తిరిగి అమలు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఇప్పటికే ఒక ప్రశ్న నమోదు చేయించా.

మైనర్ లిఫ్ట్‌ఇరిగేషన్ నిర్వీర్యం, వాటి పునరుద్ధరణ కోసం.. నల్లమిల్లి

రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన లిఫ్ట్ ఇరిగేషన్, ఇతర ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. వాటి పునరుద్ధరణ, రిపేర్లకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటి పునరుద్ధరణ అవసరాలపై ఓ ప్రశ్న అడగనున్నా. ఇక అనపర్తిలోని జీబీఆర్ కాలేజీని 1978లో రైతులు తమ సొమ్ముతో నిర్మించారు. దాన్ని మేనేజ్మెంట్ సొంతం చేసుకుని రైతులకు సంబంధం లేకుండా చేసింది. దీనిపై విచారణ జరుగుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం సభ దృష్టికి తీసుకుని వెళ్లనున్నా. కాటన్ బ్యారేజీ రిపేర్లకు రూ.150 కోట్లు మంజూరయ్యాయి. దానికి అభినందించే తీర్మానం కూడా పెట్టే ఆలోచన చేస్తున్నా.

కొత్త పంచాయతీల ఏర్పాటు అవసరాన్ని ప్రస్తావిస్తా.. ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం నియోజకవర్గంలో కొన్ని పంచాయతీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. పర్యాటకపరంగా కొన్ని దేవాలయాల అభివృద్ధి, కోరుకొండ ఆలయానికి రోప్‌వే వంటివి ప్రస్తావిస్తా. గోదావరి పుష్కరాల సమయంలో ఘాట్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల గురించి కూడా ప్రస్తావిస్తాను.

గోదావరి పుష్కరాల్లో కొవ్వూరుకు ప్రాధాన్యత కోసం.. ఎమ్మెల్యే ముప్పిడి

గోదావరి పుష్కరాల సమయంలో కొవ్వూరు ప్రాంతంలో కూడా ఎక్కువ భక్తులు వస్తారు. అందువల్ల ఇక్కడ ఘాట్లు పెంచడం, మౌలిక సదుపాయాల గురించి ప్రస్తావిస్తాను. కొవ్వూరులో గోదావరి నీటిని మంచినీటిగా అందించాల్సిన అవసరం ప్రస్తావిస్తా.

ఎర్రకాలువ వరదనీటితో రిజర్వాయర్ నిర్మాణం కోసం.. ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం నియోజకవర్గంలో ఇరిగేషన్ సమస్య ప్రధానంగా ఎక్కువ ఉంది. వానలు బాగా పడినపుడు ఎర్రకాలువకు వచ్చిన వరదనీటిని నిల్వచేసి వినియోగించుకోవడానికి వీలుగా ఓ రిజర్వాయర్ నిర్మాణం కోసం సభ దృష్టికి తీసుకుని వెళ్లనున్నా. అదేవిధంగా నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన, ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం వంటి సమస్యలతోపాటు నిధుల కోసం సభలో ప్రస్తావించనున్నా.

గోదావరి పుష్కరాలు - 2027 పనులకు డీపీఆర్‌తో సిద్ధంకండి!

- రహదారులు, డ్రైనేజీ పనులు వేగవంతం చేయండి
- పంచాయతీలకు వచ్చే ఆదాయంతో అదే పంచాయతీల అభివృద్ధి
- అమృత్2.0లో రూ.290 కోట్ల నిధులు మంజూరు
- సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ


రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారాయణ.. చిత్రంలో కలెక్టర్ కీర్తి చేకూరి, రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027 పనులకు సంబంధించిన డీపీఆర్‌లతో ప్రభుత్వ శాఖలు సిద్ధం కావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన జరిగిన ప్రభుత్వశాఖల సమీక్ష సమావేశంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ సమీక్షలో మాట్లాడారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులపై, రాజమహేంద్రవరం అభివృద్ధిపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు, రవాణా, స్నానాల రేవుల అభివృద్ధి తదితర అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై సమగ్రంగా చర్చించారు. పుష్కరాల పనులకు ప్రభుత్వ శాఖలు డీపీఆర్‌లు సిద్ధం చేయాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్కరాల ప్రతిపాదిత పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. పుష్కరాలకు రూ.456 కోట్లతో రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

గ్రామ పంచాయతీలకు సంబంధించి వచ్చే ఆదాయం ఆయా గ్రామాల అభివృద్ధికే కేటాయించాలని మంత్రి నారాయణ చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న రహదారులు, డ్రైనేజీల పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. రాజమహేంద్రవరంలో 50.6 ఎంఎల్‌డీ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు 60 శాతం పూర్తిచేశారని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి దీనిని పూర్తిచేసుకుని మరో 5ఎంఎల్‌డీ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు డిసెంబరు నాటికి పూర్తిచేయాలన్నారు. అమృత్ 1.0లో రూ.82.16 కోట్ల పనులు చేపట్టి.. వాటిలో రూ. 37 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేశారని చెప్పారు. అమృత్ 2.0లో రూ.290 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులు టెండర్లు ఈ నెలాఖరునాటికి పిలిచి ఆయా పనులు రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులు సమగ్ర డీపీఆర్‌ను సిద్ధం చేస్తామన్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పుష్కరాలకు క్రౌడ్ మేనేజ్మెంట్, ఘాట్ల అభివృద్ధి, ట్రాఫిక్ మళ్లింపు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించామన్నారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టవలసిన పనులన్నింటినీ మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాజమహేంద్రవరంలో ఘాట్ల అనుసంధానం అభివృద్ధి, రహదారుల అభివృద్ధి, ఘాట్లకు అనుసంధానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాల్సివుందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం ఉన్న 8 ఘాట్లను తొమ్మిది ఘాట్లుగా అభివృద్ధి చేయాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం తర్వాత అత్యధికంగా భక్తులు పుణ్యస్నానాలు చేసేది కొవ్వూరులోనేనని చెప్పారు. గత ఐదేళ్లలో కొవ్వూరు ప్రాంతం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, గోదావరి పుష్కరాల పనుల్లో భాగంగా కొవ్వూరును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను మంత్రికి అందించానన్నారు. రుడా చైర్మన్ బొడ్డువెంకట రమణచౌదరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు.


కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే నల్లమిల్లి

మహోన్నతవ్యక్తి, ప్రపంచ సృష్టికర్త విశ్వకర్మ

జయంతి కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ స్వయంభూ, ప్రపంచ సృష్టికర్తగా పరిగణించబడిన మహోన్నత వ్యక్తి అని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి బి.శశాంక, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరెడ్డి, సహాయ బీసీ సంక్షేమాధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

- ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ సీహెచ్ కీర్తి, ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము హాజరు
- నేటి నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా వ్యాప్తంగా 421 ఆరోగ్య శిబిరాలు


సభలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

ధవళేశ్వరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలో తొలిసారిగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, కలెక్టర్ చేకూరి కీర్తి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని, అదే సమయంలో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ధవళేశ్వరం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేలా చూడడమే ఈ పథక లక్ష్యమన్నారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఈ పథకంలో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 421 ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా ఎన్‌సీడీ స్క్రీనింగ్, టీబీ గుర్తింపు, రక్తహీనత నివారణ, సికిల్ సెల్ స్క్రీనింగ్, గర్భిణీ ప్రసవానంతరం ఆరోగ్య పరీక్షలు, రోగ నిరోధక టీకాలు, రక్తదాన శిబిరాలు, పీఎంజేఏవై ఆయుష్మాన్ కార్డుల పంపిణీ వంటి సేవలు అందించనున్నట్టు తెలిపారు. తర్వాత గర్భిణీలకు పౌష్టికాహారం, పసుపు, కుంకుమ, పండ్లతో కిట్‌లను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహత్తర సేవ

- మోదీ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన ఎంపీ పురందేశ్వరి


బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరి ప్రాణాలు కాపాడే మహత్తర సేవ అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి, రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో ఎంపీ పురందేశ్వరి స్వయంగా రక్తదానం చేసి అందరికీ ప్రేరణ కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాజమండ్రి అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగబాబు, నాయకులు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, వీరా వీరాంజనేయులు, శెట్టిపల్లి శివ నాగరాజు, మోహిని, బండి ప్రసాద్, అడపా వరప్రసాద్, తగరం సురేష్, కురగంటి సతీష్, రవిశంకర్, డాక్టర్ ఉమా పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ..

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాజమహేంద్రవరం జీవకారుణ్య సంఘంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తుపై అవగాహన

రాజమహేంద్రవరం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఈగిల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్ఐలు, రైటర్లు, అసిస్టెంటు రైటర్లకు ఈగిల్ విభాగం ఇన్స్‌పెక్టర్లు జి.రవికుమార్, పీవీ సూర్యమోహన్‌రావు ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కేసు నమోదు నుంచి చార్జిషీటు దాఖలు చేసేవరకూ ఏ సమాచారాన్ని ఏవిధంగా రికార్డుచేయడం, ఎలా సీల్ చేయడం, మేజిస్ట్రేట్ దగ్గర ఇన్వెంటరీ సర్టిపై చేయించే విధానం, నమూనాల సేకరణ, ఎఫ్ఎస్ఎల్‌కి పంపడం, దర్యాప్తు పూర్తయిన తర్వాత సీజ్ చేసిన పదార్థాలను ధ్వంసం చేయడం వంటి అంశాలను వివరించారు. సిబ్బందికి ప్రాక్టికల్‌గా కూడా తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బంగారు చేప చిక్కింది.. 1.5 కిలోలు రూ.6 వేలు

కాకినాడ కుంభాభిషేకం ఫిషింగ్ హార్బర్ వద్ద ఒక జాలర్ వలకి బంగారు చేప చిక్కింది. 1.5 కిలోలు బరువున్న ఈ చేప రూ.6 వేల దర పలికింది. ఈ చేపను ఘోల్ చేప అని పిలుస్తారు. రంగును బట్టి బంగారు చేపగానూ పిలుస్తారు. ఈ చేపలోని గాల్ బ్లాడర్‌ను మందుల తయారీలో ఉపయోగిస్తారు. అందుకే దీనికి ఇంత డిమాండ్ ఉంటుందని మత్స్యకారులు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి/ కార్పొరేషన్(కాకినాడ)



జీజీయూలో 'లిటిల్ హార్ట్స్'

లిటిల్ హార్ట్స్ చిత్ర బృందం రాకతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. లిటిల్ హార్ట్స్ సినిమా విజయ యాత్రలో భాగంగా ప్రముఖ హీరో మౌళి, నటుడు జయకృష్ణ జీజీయూను సందర్శించారు. ఈ సందర్భంగా సినిమాలోని కొన్ని డైలాగ్‌లను చెప్పి విద్యార్థులనుద్దేశించి కొద్దిసేపు మాట్లాడారు. విద్యార్థులు సినీనటులతో కలిసి ఫొటోలు తీయించుకునేందుకు ఆసక్తి చూపారు. అనంతరం హీరో మౌళిని జీజీయూ తరపున సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

- ఆంధ్రజ్యోతి/ రాజానగరం



'ఆదిత్య'లో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్

గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ మోటారు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్ ఈవెంట్‌ని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. వందమందికి పైగా విద్యార్థులు ప్రొఫెషనల్ సేఫ్ రైడింగ్, రైడర్-డిసిప్లిన్, మోటారు స్పోర్ట్స్ భద్రతా ప్రమాణాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందారు. హైదరాబాద్ కేటీఎం అకాడమీ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్ అమన్, ఆదిత్య తమ బృందంతో సేఫ్ రైడింగ్ నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి/గండేపల్లి

నిరంతరాయంగా 'సుభోజనం'

దశాబ్దకాలంగా జీజీహెచ్‌లో హరేకృష్ణ మూమెంట్ వితరణ సేవ

ఉచితంగా నిత్యం వందలాది మంది ఆకలి తీరుస్తున్న దాతలు

రూ.10తో ఆరంభం.. ఇప్పుడు ఉచితం



భోజనం వడ్డిస్తున్న దాతతో కలసి వైకుంటేశ్వర దాస

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదానాల్లో అన్నదాతం గొప్పది అంటారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ ఏముంటుందని అందరూ భావిస్తారు. ఈ భావనతో దైవకార్యంలో ఉండే ఇస్కాన్ అన్నార్తుల ఆకలి తీర్చే పనిలో నిమగ్నమైంది. వీరి ఆధ్వర్యంలో పనిచేస్తున్న హరేకృష్ణ మూమెంట్ సంస్థ కాకినాడ జీజీహెచ్‌లో 'సుభోజనం' పేరుతో దాతల సహకారంతో వేలాది మంది రోగుల సహాయకులకు, నిరుపేదలకు హోటళ్లకు దీటుగా మంచి ఉచిత భోజనాన్ని అందిస్తోంది. జీజీహెచ్‌లో గత పది సంవత్సరాలుగా ఈ హరేకృష్ణ మూమెంట్ అండ్ టచ్ స్టోన్ ఛారిటీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిరంతరాయంగా నడుస్తోంది. తొలుత రూ.10లకు ప్రారంభమైన ఈ సుభోజనం కొంతకాలం తరువాత దాతల సహకారంతో 90 శాతం ఉచిత భోజనంగా మారింది. రోగుల సహాయకులు 2016కు ముందు జీజీహెచ్ సమీపంలో ఉన్న హోటళ్లలో రూ.80 నుంచి రూ.100 ఖర్చు చేసి భోజనం కొనుగోలు చేసేవారు. అయితే జీజీహెచ్‌కు వచ్చేవారు ఎక్కువశాతం నిరుపేదలే కాబట్టి ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. సుభోజనం ప్రారంభించాక భోజనానికి ఖర్చు చేసే నగదు మందులకు ఉపయోగపడేవి అయితే సుభోజనం కౌంటర్‌లోని భోజనం బయట హోటళ్లకన్నా రుచిగా, శుచిగా ఉంటుందని రోగుల సహాయకులు చెబుతున్నారు.

ఇక సుభోజనం మొదలైన ఈ పదేళ్లలో జీజీహెచ్‌లో 20 లక్షల మందికి అన్న వితరణ జరిగింది. రెండు పూటల సుభోజనం సేవలు జరుగుతున్నాయి. ప్రతిరోజు సుమారు 850 మందికి అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు 40 లక్షల మందికి ఉచిత భోజనం అందజేయడం జరిగిందని సుభోజనం సమన్వయకర్త వైకుంటేశ్వరదాస తెలిపారు. అలాగే కేజీహెచ్‌ను స్ఫూర్తిగా తీసుకుని బాబా టాటా మెమోరియల్ కేన్సర్ హాస్పటల్‌లో 2023లో సుభోజనం ప్రారంభించడం జరిగింది. అలాగే 2018లో విజయవాడ జీజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించాం. అలాగే 2021లో నెల్లూరు జీజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించాం. మన కాకినాడ జీజీహెచ్‌తో కలిపి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5 సుభోజనం కౌంటర్ల ద్వారా ఇప్పటివరకు 75 లక్షల మంది రోగుల సహాయకులకు భోజన వితరణ కార్యక్రమం నిర్వహించామని వైకుంటేశ్వర దాస చెప్పారు. హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపకులు భక్తి వేదాంతస్వామి ప్రభు. ఈ సంస్థ ఆశ్రమాలకు పది మైళ్ల దూరంలో ఎవరూ ఆకలితో ఉండరాదు అనే ఆయన ఆశయం మేరకు ఈ సుభోజనం ప్రారంభించినట్టు చెప్పారు. కాకినాడ జీజీహెచ్‌లో సుభోజనాన్ని విస్తరింపజేయడం, మరికొంతమందికి రుచిగల భోజనాన్ని అందించేందుకు దాతలు ఫోన్ నెంబర్ 8096211108ను సంప్రదించవచ్చని వైకుంటేశ్వరదాస చెప్పారు.



మధురపూడి విమానాశ్రయంలో బుధవారం నిర్వహించిన యాత్రీ సేవా దివస్‌లో భాగంగా ప్రయాణికులకు సంప్రదాయ స్వాగతం.. కూచిపూడి నృత్యం చేస్తున్న బాలికలు



విమానాశ్రయంలో...



విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవా దివస్‌లో భాగంగా రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా యాత్రీ సేవా దివస్

కోరుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవా దివస్-2025 వేడుకలు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ వేడుకల్లో విమానాశ్రయ డైరెక్టర్ ఎస్‌కె.శ్రీకాంత్ నేతృత్వంలో రాజమండ్రి విమానాశ్రయం విశేషంగా పాల్గొంది. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విమానయానం చేసే ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలను అందించాలనే నిబద్ధతను ప్రతిబింబించేలా ఈ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రయాణికులు, ప్రజలు విశేషంగా స్పందించారన్నారు. కాగా వేడుకల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆతిథ్య సత్కారాలు నిర్వహించారు. అలాగే ఏక్ పేడ్ మాకే నామ్ నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లకు సత్కారం, విద్యార్థులు విమానాశ్రయ సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. యాత్రీ సేవా దివస్ ద్వారా ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సంతృప్తి ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడం, భారతీయ విమానాశ్రయాలను మరింత కలుపుకుని స్థిరమైన, ప్రయాణికులకు అనుకూల వాతావరణంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని శ్రీకాంత్ వివరించారు. ఈ వేడుకలు విమానాశ్రయాలు, ప్రయాణికుల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించాయని ఆయన అభిప్రాయపడ్డారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం

రూ.1.49 కోట్లు

- బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు
- ఏడు దేశాల కరెన్సీ లభ్యం
- వెల్లడించిన ఉప కమిషనరు, ఈవో

ఆత్రేయపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం తెరిచి లెక్కించారు. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టీవీఎస్ఆర్ ప్రసాద్, ఎం.సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 27 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,15,09,966, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.34,11,312 ... మొత్తం రూ.1,49,21,278 ఆదాయం లభించింది. బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు, ఏడు దేశాలకు చెందిన 45 కరెన్సీ లభించించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, అర్చకులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

'నన్నయ'లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విద్యార్థులకు బుధవారం డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 86 మంది విద్యార్థులు హాజరై రాత పరీక్ష రాయగా 54 మందిని షార్ట్ లిస్ట్ చేశారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. తర్వాత వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఈ డ్రైవ్‌ను వీసీ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయం తరఫున ఎక్కువ మందికి ఉద్యోగావకశాలు కల్పించాలని కోరారు. తరచూ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ డ్రైవ్‌లు జరిపి ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాలు అందిపుచ్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంధ్ర యువ సంకల్ప్ డిజిటల్ మారథాన్‌కు వీడియోలు ఆహ్వానం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతను భాగస్వామ్యం చేస్తూ ఆంధ్ర యువ సంకల్ప్-2కే25 డిజిటల్ మారథాన్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం వీడియోలు ఆహ్వానిస్తున్నట్టు యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.andhrayuvasankalp.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, డిజిటల్ ఇన్నోవేషన్, ఏఐ టెక్నాలజీ, స్మార్ట్ యూత్ ఏపీ.... విభాగాల్లో సందేశాత్మక వీడియోలు తీసి పంపించాల్సి ఉంటుందన్నారు. 18-35 ఏళ్ల వయసు కలిగిన వారు అయి ఉండాలని, 120 సెకన్ల నిడివితో వీడియో ఉండాలన్నారు. షార్ట్‌లను వారి సొంత సోషల్ మీడియాలో (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ షార్ట్) మార్గదర్శకాల్లో చూపించిన అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్ట్ చేయాలని కోరారు. జ్యూరీల వచ్చిన ఎంట్రీలను పరిశీలించిన అనంతరం మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50వేలు ఇస్తారన్నారు. తొమ్మిది మంది విజేతలను 'ఆంధ్ర యువ సంకల్ప్-2కే25' అంబాసిడర్లుగా సత్కరిస్తారని చెప్పారు.

29న కాకినాడలో జయలక్ష్మి సొసైటీ మహాజన సభ సమావేశం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ది జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 4వ మహాజన సభ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. అజెండాలోని విషయాలను జయలక్ష్మి సొసైటీ సభ్యులందరికీ ఈ నెల 8వ తేదీన నోటీసు ద్వారా పంపించామన్నారు. జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంలో ఇద్దరు డైరెక్టర్లు, ఆఫీసు బేరర్ (ట్రెజరర్) పదవులు ఖాళీ అయ్యాయని... ఈ స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు ఈ నెల 12న షెడ్యూలు జారీ అయ్యిందని, అదే రోజున ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రకటించామన్నారు. అందులో క్లెయిమ్స్, అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చైర్మన్/సీఈవోకి రాతపూర్వకంగా అందించాలని ఒక ప్రకటనలో కోరారు.

సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంగా మార్చుకోవాలి

ప్రాంగణ నియామక శిక్షణ ప్రారంభోత్సవంలో నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంగా మార్చి లక్ష్యాలను చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుని కార్పొరేట్ ప్రపంచంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ నియామక శిక్షణ (సీఆర్‌టీ) బుధవారం ప్రారంభమైంది.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ

ఇందులో పాల్గొన్న వీసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సీఆర్‌టీ ద్వారా గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, ఉపాధి సామర్థ్యాలను పెంపొందిస్తూ కార్పొరేట్ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తారన్నారు. ఆప్టిట్యూడ్ పరీక్షలు, సాంకేతిక ఇంటర్వ్యూలు, బృంద చర్చలు వంటివి నియామక ప్రక్రియల్లో వారి పనితీరును మెరుగుపరచడం ద్వారా విద్యార్థులకు సహాయపడతాయని చెప్పారు. తద్వారా విద్యాభ్యాసం, పరిశ్రమ డిమాండ్ల మధ్య అంతరం తగ్గుతుందన్నారు. మూడు రోజులు జరిగే శిక్షణలో కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

విశ్వవిద్యాలయం ఉద్యోగ కల్పనాధికారి బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ పీఎం ఉషా సహకారంతో ఎస్‌డీవీఎల్ సంస్థతో విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ విభాగం, నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్వహిస్తున్న సీఆర్‌టీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ప్రశాంతి, సునీత వివిధ అంశాలను వివరించారు.



టేబుల్ టెన్నిస్ ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్

అండర్-14, 17 టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాలులో బుధవారం జరిగిన అండర్ 14, 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలో సుమారు 120 మంది పాల్గొన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షించారు. పీటీ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవిరాజు, పీడీలు లంక జార్జ్, మంగయమ్మ, వి.అరుణ, రవికౌర్, సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, ఎం.హరిబాబు, ఎల్.రవికుమార్, శ్రీహరిరాజు, శంషాద్ బేగం, ఎల్.సతీష్, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు వాయిదా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు, మండల స్థాయి సెలక్షన్లు, కాకినాడ జిల్లాలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగాల్సిన సెలక్షన్స్ వాయిదా వేశామని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. ఆ తేదీల్లో ఉమ్మడి మెగా డీఎస్‌సీ వ్యాయామ ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో డ్యూటీలో ఉండడం వల్ల కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల కోసం నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలశర్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి మూడు విడతల్లో సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా నాలుగో విడతలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవల్ చేయించుకోవాలన్నారు. లేదంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని తెలిపారు. మరిన్ని వివరాలకు 08842348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 29న, ప్రైవేట్ ఐటీఐలో ఈ నెల 30న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

బాకీ తీర్చేస్తానని పిలిచి.. బావిలోకి తోసేసి!

- ఇద్దరిని చంపి మరొకరిపై హత్యాయత్నం
- కాకినాడ జిల్లా తాటిపర్తిలో ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితుడు!



గొల్లప్రోలు మండలం తాటిపర్తి పొలాల్లోని బావిలో తేలిన మృతదేహం





హత్యకు గురైన శ్రీను, సూరి బాబు (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు ఇద్దరిని హత్య చేయడమే గాక నూతిలో పడవేసి మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగింది. ఈ సంఘటన బుధవారం పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది.

అసలేం జరిగిందంటే...

తాటిపర్తి గ్రామానికి చెందిన రంపం గంగాధ ర్ అవసరాల నిమిత్తం తన బంధువులైన రంపం శ్రీను (51), తోరాటి సూరిబాబు (44), కుంపట్ల సూరిబాబు (36) వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చకపోవడంతో గంగాధర్‌ను చెల్లించాల ని వారు ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మం గళవారం రాత్రి 8గంటల సమయంలో రంపం శ్రీను, తోరాటి సూరిబాబుకు గంగాధర్ ఫోన్ చేసి అప్పు తీర్చేస్తానని, మాట్లాడే పని ఉందని పిలిచి పథకం ప్రకారం గ్రామ శివారుకు తీసుకువెళ్లాడు. అక్కడ పొలాల్లో ఉన్న బావి వద్దకు వెళ్లిన తర్వాత వారిద్దరిని నూతిలోకి తోసేసి హత్య చేశాడు. అనంతరం మరొక వ్యక్తి కుంపట్ల సూరిబాబుకు బాకీ ఇచ్చేస్తానని చెప్పి రమన్నాడు. గంగాధర్ సూరిబాబును తన మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని తాటిపర్తి పుంతరోడ్డులోని సుద్దగడ్డ వాగు వద్దకు తీసుకువెళ్లి సెల్‌ఫోన్ పడిపోయిందని చెప్పి వెతుకుతున్నట్టు నటించాడు. అదే సమయంలో సూరిబాబును చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకుని గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. కుంపట్ల సూరిబాబు ఫిర్యాదుపై పిఠాపురం సీఐ శ్రీనివాస్ కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాకినాడ ఏ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ సంఘటనా స్థలా న్ని పరిశీలించారు. రంపం శ్రీను కౌలు రైతు కాగా అతడికి భార్య బేబీ, ముగ్గురు కుమారులు ఉన్నారు. తోరాటి సూరి బాబు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య భవానీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సంఘటనా స్థలంలో పోలీసు జాగిలాలు

అప్పిస్తే ప్రాణం తీశాడు..

ఆపదలో ఉన్నాను, సొమ్ములు కావాలని చెప్పడంతో అప్పు ఇస్తే రంపం గంగాధర్ తమ వారి ప్రాణాలు తీశాడని తోరాటి సూరిబాబు, రంపం శ్రీను కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటన తాటిపర్తి పరిసర గ్రామాల్లో సంచలనంగా మారింది. పథకం ప్రకారమే గంగాధర్ ఈ ఇద్దరిని హత్య చేసినట్టు చెప్తున్నారు. కాగా కేసు దర్యాప్తులో ఉందని, ఆర్థికపరమైన విషయాలే ఈ సంఘటనకు కారణమని ఏఎస్పీ తెలిపారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసు జాగిలాలు నిందితుడు రంపం గంగాధర్ ఇంటి వరకూ వెళ్లి ఆగాయి. అయితే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం తెలిసింది.



విలపిస్తున్న సూరిబాబు కుటుంబసభ్యులు

స్క్రూడ్రైవర్ నెయిల్ మింగిన బాలుడు

శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన భద్రాచలం ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు



ఆపరేషన్ అనంతరం బాలుడితో వైద్యులు, సిబ్బంది



బాలుడు మింగిన నెయిల్

ఎటపాక, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఎనిదేళ్ల బాలుడు స్క్రూ డ్రైవర్ నెయి ల్‌ను మింగి ప్రాణాల మీదుకు తెచ్చు కున్నాడు. చివరకు భద్రాచలం ప్రభు త్వ వైద్యశాల వైద్యులు బాలుడి పేగులో ఇరుకున్న 6 సెంటీమీటర్ల స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను తొలగించి ప్రాణాలు కాపా డారు. అల్లూరి జిల్లా ఎటపాక మండ లం చోడవరం గ్రామానికి చెందిన తు మ్మల సునీల్, రాజేశ్వరి దంపతుల తు మ్మల గౌతమ్(8) మూడురోజుల క్రితం ఆడుకుంటూ స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను మింగాడు. అప్పటి నుంచి కడుపులో నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు తెలి పాడు. తాను స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను మింగానని తెలిపినా తల్లిదండ్రులు నమ్మలేదు. కడుపు నొప్పితో కుమారుడు బాధపడుతు న్నాడని తల్లిదండ్రులు బుధవా రం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. దీంతో బాలుడిని పరీక్షించిన వైద్యులు ఎక్స్‌రే తీసి బాలుడి పేగులో స్క్రూడ్రైవర్ నెయిల్ ఇరుకున్నట్టు గుర్తించారు. దీంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది బృందం శస్త్ర చికిత్స చేసి 6 సెంటీమీటర్ల స్క్రూడ్రైవర్ నెయిల్‌ను తొలగించారు. బాలుడు ప్రాణాపాయం నుంచి బయటపడి క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో
సుప్రీం ఆదేశాలు పాటించాలి : పీడీజే



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఈ మేరకు బుధవారం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ కమిటీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. మోటారు వాహనాల చట్టం-1988, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్స్ స్కీమ్-2022 నిబంధనలను అనుసరిస్తూ బాధితులకు పరిహారం అందజేయడంలో కమిటీ బాధ్యతగా వ్యవహరిస్తూ సహాయాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం ఆర్డీవోలు శ్రీకర్, కృష్ణ నాయక్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

16వ నెంబరు జాతీయ రహదారి
ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో స్టేక్‌హోల్డర్స్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పాల్గొన్న ఎమ్మెల్యేలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): జిల్లా సత్వరాభివృద్ధి, ప్రజల జీవన వికాసానికి దోహదం చేసే 16వ నెంబరు జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారిని ఆరులైన్ల విస్తరణ కోసం నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో వివిధ అలైన్‌మెంట్ ఆప్షన్లతో సిద్ధం చేసిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో స్టేక్‌హోల్డర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు లైన్ల రహదారిగా ఉన్న దీన్ని ఇరువైపులా విస్తరించి 60మీటర్ల వెడల్పుకు పెంచుతామన్నారు. వంపులు సరిచేయడానికి, జనా వాసాలను తప్పించడానికి అవసరమైన చోట్ల 60 మీటర్ల వెడల్పులో బైపాస్‌రోడ్లు ప్రతిపాదించామన్నారు. ప్రజల సౌకర్యం కోసం అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, సర్వీసురోడ్లు అలైన్‌మెంట్‌లో ప్రతిపాదించామన్నారు.

అలైన్మెంట్‌లతో డీపీఆర్‌కు రూపకల్పన

నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌కుమార్ మాట్లాడుతూ జాతీయరహదారి విస్తరణలో భాగంగా అనకాపల్లి నుంచి అన్నవరం మీదుగా దివాన్‌చెరువు వరకు 741.255 కిలోమీటర్ల నుంచి 903.00 కిలోమీటర్ల వరకు ఉన్న నాలుగులైన్ల రోడ్డును ఆరు లైన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేందుకు వివిధ అలైన్మెంట్‌లతో డీపీఆర్ రూపొందించామన్నారు. ప్రతిపాదిత ఆరులైన్ల రహదారి విస్తరణలో అనకాపల్లి, కసింకోట, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో 68.645 కిలోమీటర్లు, కాకినాడ జిల్లాలోని తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, గండేపల్లి మండలాల్లో 80.600 కిలోమీటర్లు నిర్మిస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం మండలంలో 11 కిలోమీటర్లు ప్రతిపాదించామన్నారు. మొత్తంగా 160 కిలోమీటర్లు మేరకు నిర్మించాలన్నారు. విస్తరణలో భూసేకరణ, నిర్మాణ వ్యయం, జనజీవనం, రహదారిపై కట్టడాలు, ఫ్లైఓవర్‌లు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు.

మార్పులు సూచించిన ఎమ్మెల్యేలు..

ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప తమ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన రోడ్డులో అవసరమైన మార్పులు సూచించారు. జాతీయ రహదారి అంతా సౌరశక్తితో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల కోరారు. ఎన్‌హెచ్ 16, ఏడీబీ రోడ్డు కలిసే చోట రాజానగరం కూడలిలో ట్రంపెట్ కనెక్షన్ నిర్మించాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. ధర్మవరం వద్ద జాతీయ రహ దారి పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటేందుకు అండర్‌పాసులు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. తొండంగి వైపున సర్వీసు రోడ్డు నిర్మించాలని తుని ఎమ్మెల్యే దివ్య సూచించారు. సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డీఆర్వో వెంకట్రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కంఠు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ప్రసాద్, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం జీజీహెచ్ అభివృద్ధికి
దాతలు ముందుకురావాలి : ఎంపీ



అధునాతన వైద్య పరికరాలు ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధికి దాతలు మరింతమంది ముందుకురావాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు గెయిల్ సమకూర్చిన అధునాతన వైద్యపరికరాలను ఆసుపత్రి అధికారులకు అందజేసే కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడుతూ బోధనాసుపత్రి ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని, దాతలు సహకరిస్తే ఎక్కువ మందికి సహాయం అందించే అవకాశం ఉంటుందన్నారు. జీజీహెచ్‌లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో లేవని వైద్యులు, సిబ్బంది కొరత ఉందని చెప్తున్నారని, ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఏ ఒక్కరినీ కాకినాడ రిఫర్ చేసే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, డిప్యుటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణంరాజు, ఆర్‌ఎంవో సుబ్బారావు పాల్గొన్నారు.

కాజులూరు రోడ్లు కానరావా?

- రోడ్ల దుస్థితిపై అఖిలపక్ష నాయకుల ఆందోళన
- వంటా వార్పు, రాస్తారోకో



కాజులూరు కృష్ణుడి గుడి వద్ద రోడ్డుపై వంటవార్పుతో ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

కాజులూరు(కరప), సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): భారీ గోతులు, గతుకులతో అధ్వాన్నంగా మారిన కాకినాడ జిల్లాలోని కాజులూరు రోడ్ల దుస్థితిని నిరసిస్తూ అఖిలపక్ష నాయకులు బుధవారం తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టారు. కాజులూరు కృష్ణుడి గుడి వద్ద వందలాది మంది రాస్తారోకో చేసి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. రోడ్డుపైనే వంటా వార్పు నిర్వహించి అసంపూర్తిగా వదిలేసిన గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారితో బాటు ఇతర శిథిల రోడ్లు, వంతెనల నిర్మాణాలను ప్రభుత్వం తక్షణం చేపట్టాలంటూ పెద్దఎత్తున డిమాండ్ చేశారు. గతంలో రూ.36కోట్లతో చేపట్టిన గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారి నిర్మాణాన్ని వివిధ కారణాలతో మధ్యలోనే నిలిపివేశారని దీని వల్ల దాదాపు 30గ్రామాలకు చెందిన వేలాదిమంది నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపించారు. జూలైలో దీనిపై ధర్నా చేపట్టగా మంత్రి సుభాష్ ఆగస్టు 5 నుంచి పనులను పునఃప్రారంభిస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి రోడ్లకు మోక్షం కలిగించాలని లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కాజులూరు తహశీల్దార్ జి.రవీంద్రనాథ్, ఎస్‌ఐ ఎం.మోహన్ కుమార్ ఘ టనాస్థలికి చేరుకుని ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కొంత మంది స్థానిక నేతల ప్రమేయంతో ఆందోళన విరమించారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, జేఏసీ నాయకులు సలాది నానాజీ, యాళ్ల సత్తిబాబు, శీల మాజీ ఎంపీటీసీ మాధవరపు నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డులో పడి గణిత ఉపాధ్యాయుడికి గాయాలు



గాయాలతో ఉపాధ్యాయుడు

గతుకులతో అధ్వానంగా మారిన కాజులూరు మండలం దుగ్గుదురు ప్రధాన రహదారిపై అదుపుతప్పి పడి ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. కాజులూరు హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చుండి శ్రీష మంగళవారం ఉదయం స్కూటీపై ద్రాక్షారామ నుంచి కాజులూరు హైస్కూల్‌కు బయలుదేరాడు. దుగ్గుదురు వచ్చేసరికి బండిపై నుంచి అదుపుతప్పి కిందపడిపోయాడు. తలతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలై కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాజులూరు మండలంలోని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

రేపు కొత్త టీచర్లకు నియామకపత్రాల జారీ

విజయవాడలో అందజేయనున్న సీఎం చంద్రబాబు

ఉమ్మడి జిల్లా నుంచి 70 ఆర్టీసీ బస్సులు సిద్ధం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ - 2025లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి టీచర్లుగా విజయం సాధించిన అభ్యర్థులను విజయవాడ తీసుకెళ్లడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 70 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 19న విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొనే ఒక కార్యక్రమంలో కొత్త టీచర్లకు సీఎం నియామకపత్రాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి వారంతా వెళ్లడానికి వీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 50 బస్సులు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి పదేసి బస్సుల చొప్పున కేటాయించారు. 19న ఉదయం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ నుంచి ఈ బస్సులన్నీ విజయవాడ బయలుదేరి వెళ్లనున్నాయి. ఇప్పటికే స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకానికి ఏ రోజుకారోజు బస్సులను సంసిద్ధం చేసే పనిలో తలమునకలై ఉన్న ఆర్టీసీ అధికార యంత్రాంగానికి తాజాగా విజయవాడకు బస్సులను కేటాయించాల్సి రావడం కత్తి మీదసాములా మారిందని చెప్తున్నారు.

డిప్యూటీ సీఎం, ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు

పిఠాపురం పోలీసులకు జనసేన నాయకుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

పిఠాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లను కించపరిచే విధంగా సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న పవన్, ఎంపీలపై బి.ఐశ్వర్య అనే మహిళ అనుచిత వ్యాఖ్యలు చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారని తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని వారు కోరారు.

అమ్మోనియం గ్యాస్ లీకేజీ

తాళ్లరేవు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపాలెం వద్ద జెమినీ ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియం గ్యాస్ లీకవ్వడంతో బుధవారం గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామస్తులంతా ఐస్ ఫ్యాక్టరీ సిబ్బందిని నిలదీశారు. గ్రామస్తులతో డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు చర్చించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఐస్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల రైతుల పంటనష్టంపై విచారణ చేయించి న్యాయం చేస్తామన్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

పోలీసునంటూ లారీ డ్రైవర్‌కు బెదిరింపు

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసునంటూ లారీ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మేడ్చల్ జిల్లా దూలపల్లికి చెందిన గాండ్ల సంతోష్ హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఐచర్‌వ్యాన్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వైపు బయలుదేరాడు. మంగళవారం రాత్రి కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్ట వద్ద జి యో పెట్రోల్‌బంకు వద్ద నిద్ర వస్తుందని వ్యాన్‌ను రోడ్డుపక్కగా ఆపి నిద్రించాడు. బుధవారం ఉదయం ఏపీ39 డీఎల్ 0942 నంబరు గల హోండాషైన్ బైక్‌పై సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఎస్‌ఐ డ్రెస్ వేసుకుని చేతిలో మ్యాన్‌ప్యాక్ పెట్టుకుని వచ్చి రోడ్డుపక్కన వ్యాన్ ఎందుకు ఆపావు. రికార్డు సరిగాలేదని డ్రైవర్ సంతోష్‌ను బెదిరించి స్టేషన్‌కు పద అని కొంతదూరం తీసుకువెళ్లి రూ.2వేలు తీసుకుని డ్రైవర్‌ను వదిలిపెట్టి కొవ్వూరు వైపు వెళ్లిపోయాడు. సంతోష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీహరిరావు తెలిపారు.

బైక్ చోరీపై కేసు

కె.గంగవరం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లిలో బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్‌కె జానీబాషా చెప్పారు. కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన బొజ్జా వెంకటరమణ ఈనెల 9న కోటిపల్లి శివాలయానికి అక్కడి నుంచి గోదావరి రేవుకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు వెంకట రమణకు బైక్‌ను దొంగిలించుకుని పోయారు. వెంకట రమణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జానీబాషా చెప్పారు.

ఫ్లాట్‌కి నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్



రవిని అరెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలో గోపీకృష్ణా రెసిడెన్సీలో మూడో అంతస్తులోని సీ-4 ఫ్లాట్‌కి డీజిల్ పోసి నిప్పంటించిన నిందితుడిని బుధవారం సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. రమణయ్యపేటకు చెందిన పిల్లి సత్తిబాబు, భార్య దుర్గ, ఇద్దరు కుమార్తెలు సృజన, భానుచంద్రిక కుమారుడు మణి కార్తీక్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 14న ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎవరో ఆగంతకుడు ఫ్లాటులోకి డీజిల్ పోసి నిప్పు అంటించడంతో ఇంట్లోని ఫర్నీచర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి కావడం, డీజిల్ వాసనకు శ్వాస ఆడక అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ప్రధాన డోర్ తీసేందుకు ప్రయత్నించినా, మంటలకు తలుపు రాకపోవడంతో రక్షించమని ఆర్తనాదాలు చేశారు. పరిసర ఫ్లాటులోని వారు వచ్చి తలుపు,అద్దం బద్దలుకొట్టి ఐదుగురు కుటుంబసభ్యులను కాపాడారు. ఈ ప్రమాదంపై తనకు ఇదే రెసిడెన్సీలో పెంట్‌హౌస్‌లో నివాసం ఉంటున్న పొన్నగంటి రవిచంద్రకుమార్ (రవి)పై అనుమానం ఉందని బాధితుడు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాల మేరకు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఫ్లాట్ లోపల, వెలుపల గల సీసీ కెమెరాలను పరిశీలించి, వాచ్‌మేన్‌తో పాటూ పలువురుని విచారించారు. సంఘటన జరిగిన రోజున ఫ్లాటులోకి అర్ధరాత్రి రవి ఒక్కడే సంచరించడాన్ని గుర్తించి అతడిని సర్పవరం ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్ అదుపులోకి తీసుకుని విచారించారు. సత్తిబాబుతో ఉన్న వ్యక్తిగత కక్షతోనే ఫ్లాట్‌లోకి డీజిల్ పోసి తగలబెట్టినట్లు నేరం అంగీకరించాడు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసు విషయంలో చురుగ్గా పనిచేసిన ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది సీఐ అభినందించారు.

వీధికుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు



గాయపడిన సత్యవతి



బిక్కవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో బుధవారం గ్రామానికి చెందిన వాసిరెడ్డి సత్యవతి (60)పై వీధికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. బుధవారం ఉదయం ఆమె ఇంటి ముందు తుడవడానికి బయటకు రాగా అక్కడే ఉన్న వీధి కుక్కలు దాడిచేసి చేతిపైన, నుదుటిపైన, ముక్కును కరచి గాయపర్చాయి. దీంతో స్థానికులు కుక్కలను తరిమేసి ఆమెను అనపర్తి ఏరియాఆసుపత్రికి తరలించారు.

'నన్నయ'లో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూజీసీనెట్, జెఆర్‌ఎఫ్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలుపుతూ నన్నయ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. సీఎస్‌ఐఆర్‌నెట్, జెఆర్‌ఎఫ్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులని స్పష్టంచేశారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 4వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో గాని సంప్రదించాలని ఆమె తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి




కలెక్టర్ కీర్తి చేకూరికి స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జిల్లా కలెక్టర్ కీర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసిన ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన కీర్తి చేకూరి ని రాజమహేంద్రవరం వెమ్మెల్యే ఆదిరెడ్డివాసు మర్యాద పూర్వకంగా కలిసారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసి స్వామి వారి విగ్రహాన్ని అందించి అభినందనలు తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనపర్తి(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కీర్తి చేకూరిని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ నాయకుడు సత్తి దేవదానరెడ్డి, గొల్లు హేమతులసి, గంగాభవాని ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతిని బుధవారం జిల్లా పోలీసు కా ర్యాలయంలో నిర్వహించారు. విశ్వకర్మ చిత్రప టానికి అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం ము రళీ కృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేవ వాస్తుశిల్పి విశ్వకర్మ సకల చరాచర సృష్టికి మూలకా రకుడన్నారు. ఆభగవానుడి జయంతి సందర్భంగా విశ్వ బ్రాహ్మణులకు శుభాకాంక్షలు తెలుతున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుబ్బరాజు(శాంతి భద్రతలు), అర్జున్(నేరాలు), ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ

మంత్రి దుర్గేష్ పుట్టినరోజు వేడుకలు



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న నర్సరీ సంఘం

కడియం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ పుట్టినరోజు వేడుకలు బుధవారం జరిగాయి. కడియం నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, నర్సరీసంఘం డైరెక్టర్లు కొండే పూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య తదితరులు మంత్రి దుర్గేష్‌ను ఘనంగా సత్కరించి మొక్క అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

● మంత్రి కందుల దుర్గేష్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని వేమగిరిలో బుధవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్ కట్‌చేసి, అందరికీ పంచారు. దుర్గేష్ తనయుడు కందుల కృష్ణ తేజ ఆధ్వర్యంలో జరిగాయి.



కేక్ కట్ చేసి పంచుతున్న జనసైనికులు



రాజానగరం పీహెచ్‌సీ ప్రాంగణంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



అనపర్తి: రామవరంలో కేక్ కట్ చేసి సర్పంచ్‌కు తినిపిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

భరత మాత ముద్దు బిడ్డ ప్రధాని మోదీ

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ● ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

అనపర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భరత మాత ముద్దు బిడ్డగా దేశానికి మోదీ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా రామవరం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి సర్పంచ్ గిరిడా గంగాభవానికి తినిపించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యమైన మహిళ ఇంటిలో ఉంటేనే కుటుంబానికి బలమైన పునాది ఏర్పడుతుందన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లిడి జీవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, జిల్లా కార్యదర్శి గొల్లు హేమతులసి, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బులిరెడ్డి, సర్పంచ్ గిరిడా గంగాభవాని కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి బీజేపీలో చేరిన సుధాకరరెడ్డి

అనపర్తికి చెందిన వైసీపీ నాయకుడు సబ్బెళ్ళ సుధాకరరెడ్డి వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

మెరుగైన వైద్య సేవలందించండి

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని రాజానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో కిషోర్ బాలికలకు, గర్భిణులతో పాటు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, పీహెచ్‌సీ వైద్యాధికారులు గట్టి రామభాస్కర్, సీహెచ్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఉదయ ఏంజెల్, సూపర్ వైజర్ రమణ, రెయిన్‌బో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

గోకవరం(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని బీజేపీ నాయకుడు కం బాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీఎండీ కార్యాలయం వద్ద బుధవారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పేదలు, వృద్ధులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, పెద్దాడ వెంకన్నదొర, బత్తుల నానాజీ, పసల గణేష్, దేశాల నరేష్ పాల్గొన్నారు.

బిక్కవోలు ఆలయంలో పూజలు

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఊలపల్లి, బిక్కవోలు గ్రామాల్లో బీజేపీ, కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఊలపల్లిలో వృద్ధు లకు పండ్లు, కూరగాయలు, మిఠాయిలు పంచి అమ్మపేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాలను చేపట్టారు. బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, ఎంపీపీ తేతలి సుమ, తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి, పల్లి వాసు, ఓవి.కృష్ణ, సర్పంచ్‌లు బండారు రమ్య, సరెళ్ల సుమలత, ఎంపీటీసీలు మంగయ్యమ్మ, శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి, బండారు శివ, వడ్లమూరి లక్ష్మి పాల్గొన్నారు.




ధవళేశ్వరంలో మోదీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సినీ నటుడు బాలాజీ, బీజేపీ నాయకులు, గోకవరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కంబాల శ్రీనివాసరావు

పీహెచ్‌సీలో పండ్లు, రొట్టెలు పంపిణీ

కోరుకొండ(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రపంచంలో విశ్వగురువుగా నిలుపేందుకు ప్రధాని నరేంద్రమోదీ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని బీజేపీ నాయకుడు అడపా సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, గణపతి, పచ్చారి నరసింహమూర్తి, రమణి, ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం,(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలో స్వస్థ నారీ శ్వశక్తి పరివార్ కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. ఏవీకె చైతన్య, డా. యేసురాణిల ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి , అడపా శ్రీనివాస్, రాపాక వెంకట లక్ష్మి,పెందుర్తి అచ్చుతరామారావు,దాసరి సుబ్బారావు, మద్దాల కొండలరావు ,ఖండవల్లి రావణ్, వైద్య ఆరోగ్య సిబ్బంది. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరం(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని స్థానిక జనార్ధనస్వామి కాలనీలో బుధవారం సేవా పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా పక్వాడ్ కన్వీనర్,కో కన్వీనర్ కంచుమర్తి జగన్నాధం, పురెళ్ళ రామలక్ష్మి ఆధ్వర్యంలో మోదీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఈఎస్‌ఐ బోర్డు సభ్యులు ఒంటెద్దు స్వామి, ఏఎంసీ డైరెక్టర్ పన్నాల వెంకటలక్ష్మి, షేక్ షాజిత్, డాక్టర్ జి. కొండలరావు, గుజ్జల సూరిబాబు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు తక్షణమే చెల్లించాలి

● 25న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలి

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపి మూర్తి



విలేకరులతో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ20 వేలకోట్ల పీఆర్‌సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి అన్నారు. పాఠశాల విద్యారంగ సమస్యలపై ఈనెల 25వ తేదీన విజయవాడలో యూటీఎఫ్ నిర్వహిస్తున్న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. బుధవారం గోకవరం 300 మంది యూటీఎఫ్ కార్యకర్తలతో ప్రారంభమైన బైక్ జాతా నాయకులతో కలసి యూటీఎఫ్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఉపాధ్యాయుల పై యాప్‌ల భారం పెరిగిందని, బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి జరిగే శాసన మండలి సమావేశాల్లో ఈ సమస్యలపై చర్చిస్తామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, టి.చక్రవర్తి, వివిధ జిల్లాల కార్యదర్శులు చిలుకూరి శ్రీనివాసరావు, కె.కృష్ణ పాల్గొన్నారు.

రణభేరి ఉపాధ్యాయులపై నియంతృత్వ ధోరణి తగదు

రాజానగరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై అధికారుల నియంతృత్వ ధోరణి తగదని, దీనిని విడనాడాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి పేర్కొన్నారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి కార్యక్రమం బుధవారం రాజానగరం చేరుకుంది. ఈసందర్భంగా రాజాన గరంలో ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అధికారుల నుంచి మండలస్థాయి అధికారులు వరకు ఉపాధ్యాయులపై నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఈవిధానం సరైనదికాదన్నారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎన్. అరుణకుమారి, జిల్లా అధ్యక్షుడు జైకర్, ప్రధానకార్యదర్శి ఏ.షరీఫ్, జిల్లా కార్యదర్శి దయానిధి, కోశాధికారి ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ శ్రీనివాసరావు, రాజేశ్వరి, శ్రీనుబాబు, పణి కుమార్ పాల్గొన్నారు.

రణభేరి జాతాకు బయలుదేరిన నేతలు

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన యూటీఎఫ్ రణభేరి జాతాకు బిక్కవోలు మండలం నుంచి యూటీఎఫ్ నేతలు కార్యకర్తలు బుధవారం బయలుదేరారు. రణభేరి జాతా రెండోరోజు గోకవరం నుంచి బయలుదేరి కోరుకొండ, రాజానగరం మీదుగా రాజమహేంద్రవరం, కడియం మీదుగా మండపేట చేరుకుంటుంది. బిక్కవోలు నుంచి యూటీఎఫ్ నేతలు సతీష్‌రెడ్డి, గోవిందరావు ఆధ్వర్యంలో 26 మంది నేతలు, కార్యకర్తలు రాజానగరం తరలివెళ్లారు. మండపేటవరకూ రణభేరిలో పాల్గొంటారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

కోరు కొండ (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం యూటీఎఫ్ ఉపాధ్యాయుల రణబేరి బైక్ జాతా నిర్వహించారు.గోకవరం మీదుగా కోరుకొండకు చేరిన ఈ రణబేరి బైక్‌జాతా దోసకాయలపల్లి హైస్కూల్ మీదుగా రాజమహేంద్రవరం చేరింది.ఈ సందర్భంగా దోసకాయపల్లి హైస్కూల్ వద్ద ఎమ్మెల్సీ గోపీ మూర్తికి ఉపాధ్యాయులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కోరుకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలోని శ్రీ శ్రీని వాసం, శ్రీ ప్రేమ బాల మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లోని ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలోని మహిళలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.40వేలు విలువ చేసే ఐదు కుట్టు మిషన్లను బుధవారం పంపిణీ చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు రామసేన సభ్యులు, వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు పెద్దాడ వెంకన్న దొర, పసల గణేష్, దేశాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర దరఖాస్తులను ఈనెల 20లోగా క్లియర్ చేయాలి: డీఎల్‌డీవో

బిక్కవోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాహనమిత్రకు అర్హ త కలిగిన ఆటోడ్రైవర్ల దరఖాస్తులన్నింటినీ పరిశీలించి ఈనెల 20లోగా అప్‌లోడ్ చేయాలని డివిజినల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ వీణాదేవి సచివాలయ వెల్‌ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. స్థాని క మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మండలంలోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైస్‌కార్డ్ పంపిణీని వెంటనే పూర్తి చేయాలన్నారు. మండలం మొత్తంమీద రూ.3.56 కోట్లు బకాయిలు ఉన్నా యని వీటిని వచ్చేనెల 30లోగా చెల్లించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏవో నాగేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాహనమిత్రకు దరఖాస్తుల అందజేత

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన వాహనమిత్ర పథకం కింద ఆర్థిక సాయం అందుకునేందుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. దివాన్‌చెరువులో దాదాపు 100 మంది ఆటో డ్రైవర్లు ఈపథకం కోసం తమ దరఖాస్తులను గ్రామ స చివాలయంలో అందజేశారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధికారప్రతినిధి దాసరి శ్రీనివాసరావు, వంక మల్లిబాబు, ఎర్రంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు

అనపర్తి సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటును అందిస్తున్నాయని వీటి సహకారంతో ఔత్సాహికులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఓఎన్‌జీసీ ఎస్సీసీ రాజా రమేష్ అన్నారు. బుధవారం అనపర్తిలోని మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

'ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రభుత్వ సహకారం'

కోరుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మానసికంగా కానీ, శారీరకంగా కానీదివ్యాంగులుగా ఉన్నప్పటికీ వారిని ఇంటికే పరిమితం చేయకూడదని వారిలో మార్పు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్రయత్నాలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ వద్ద బుధవారం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అనేక రకాలుగా ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు అడపా సుధీర్‌కుమార్, రొంగల శ్రీనివాస్, తాటికొండ శ్రీను, అడ్డాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 26న శెట్టిబలిజ ప్రముఖుల పేరిట అవార్డుల ప్రధానం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వచ్చేనెల 26న శెట్టిబలిజ ప్రముఖుల పేరిట అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత సానబోయిన రామారావు అన్నారు. స్థానిక తిలక్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదేరోజు శెట్టిబలిజ సంఘీయుల కార్తీక వనసమారాధన, నూతన వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్దలు తరలివస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ ప్రముఖులు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి, కుడుపూడి సూర్యనారాయణ, కుడుపూడి చిట్టాబ్బాయి, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, పిల్లి అప్పారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితర పెద్దల పేరిట అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

జేరుగుపాడులో పారిశుధ్య పనుల పరిశీలన

కడియం సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కడియం మండలం జేరుగుపాడులో పారిశుధ్య పనులను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ పరిశీలించారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆయన వీధులలో తిరిగి పారిశుధ్య పనులపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా, అసంతృప్తిగా ఉన్నారా ఆరా తీశారు. అదేవిధంగా శ్మశాన వాటికలో పండిస్తున్న కూరగాయలు, అరటి తోటను చూసి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లాలో ఈ కేంద్రం ఉన్నతంగా ఉందని కితాబు ఇచ్చి సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్, కార్యదర్శి ఐ శ్రీనివాస్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎండీవో సుబ్బారావు, ఈవోపీఆర్‌డీలు పాల్గొన్నారు.



రైటప్:స్వచ్ఛతహీ సేవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

స్వచ్ఛతహీ సేవతో ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన

● ర్యాలీ ప్రారంభంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మన ప్రధాని మోదీ ప్రారంభించిన స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచడమే ముఖ్యఉద్దేశమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం నుంచి స్వచ్ఛతహీ సేవా ర్యాలీని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రతిఏటా సెప్టెంబరు 17న స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించి వచ్చేనెల 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని చెప్పారు. శ్రమదానం, ప్లాగింగ్ డ్రైవ్స్, స్కూల్స్, పార్కులు, మార్కెట్ ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ ర్యాలీ కార్పొరేషన్ కార్యాయలం నుంచి ప్రారంభమై ఆజాద్ చౌక్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజ వల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం వాకౌట్

సీతానగరం,,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తమకు తగిన గౌరవం ఇవ్వడం లేదనిఅలాగే కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ప్రజా సమస్యలను పక్కన బెట్టి మండలంలోని వైసీపీకి చెందిన ఎంపీటీసీలు జీతాల కోసం సర్వసభ్య సమాశాన్ని బహిష్కరించారు. బుధవారం మధ్యాహ్నం 2.30కు ప్రారంభం కావాల్సిన సమావేశం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. వెంటనే ఎంపీటీసీలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని, జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. సభకు హాజరైన ట్లు సంతకాలు చేసి సభను బహిష్కరించారు. వీరికి మద్దతుగా సర్పంచ్‌లు వెళ్లిపోవడంతో సమావేశం నిలిచిపోయింది. జడ్పీటీసీ వెంకటలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌మోహన్,లు ఎంపీటీసీలులు, సర్పంచ్‌ల, తదితరులు హాజరయ్యారు.

సత్యసాయి మంచినీటి కోసం ఆందోళన

కోరుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):భగవాన్‌సత్యసాయిబాబా మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందించాలని కోరుకొండ మండలం నర్సాపురం గ్రామంలో బుధవారం ఆందోళన చేపట్టారు. గత రెండు నెలలుగా సత్యసాయి మంచినీటి పథకం ద్వారా మంచినీరు రావడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం జగ్గంపేట, రంపచోడవరం, రాజానగరం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్పందించి ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టి పరిష్కరించాలని కోరారు. ఈ ఆందోళనలో తోరాట శ్రీను, చొంగా శివయ్య, మారిశెట్టి చినసత్యనారాయణ, చొంగా తాతారావు, ఇంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వావిలాల గోపాలకృష్ణ జయంతి

రాజమహేంద్రవరంకల్చరల్ సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):స్వరాజ్య భిక్ష పేరుతో ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులకు, నిరంతరం భోజన సదుపాయాలు కల్పించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఎందరో రాజకీయ నాయకులకు ఆదర్శ ప్రాయుడని, ఆంధ్రకేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. వావిలాల 119వ జయం తి సందర్భంగా జెఎన్‌రోడ్డులో గల ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల అవరణలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామనాయుడు, ప్రిన్సిపాల్ ఉదయ్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అప్పారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గానికి సత్కారం



ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గానిని సత్కరిస్తున్న కూటమి నాయకులు

కడియం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ఎంపికైన కడియపులంక వీరహనుమాన్‌నర్సరీ రైతు, టీడీపీ సీనియర్ నాయకులు, ఆలిండియా నర్సరీసంఘం మాజీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణను బుధవారం కూటమి నాయకులు కడియపులంక మార్గాని శేషయ్య-సావిత్రి కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎం పీపీ పంతం గణపతి, బొర్సు సుబ్రహ్మణ్యం, మార్గాని ఏడు కొండలు, మల్లు శివ, సూరపురెడ్డి జానకీరామయ్య, వాసంశెట్టి నాగబా బు, కాంద్రేగుల సత్తిబాబు, గుత్తుల హరిప్రసాద్, జోగి చక్రవర్తి, ఈతకోట రాజ్‌కుమార్, మహాలక్ష్మి, పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

డివిజన్‌లో 489 ఈ-పాస్ మిషన్లు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 489 ఈ-పాస్ మిషన్లను రేషన్ డీలర్లకు అందించారు. బుధవారం రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌డీవో కృష్ణనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రేషన్ డీలర్లకు ఈ-పాస్‌లను అందించారు. ఈసందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ 65 ఏళ్ల పైబడిన లబ్ధిదారులకు రేషన్ పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతినెలా ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నాటికి రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారులు, రేషన్ డీలర్ల పాల్గొన్నారు.

19న వీర చంద్రహాస చిత్రం విడుదల

● చిత్ర నిర్మాత జేమ్స్‌వాట్,చిత్రనటీనటులు



రాజమహేంద్రవరంకల్చరల్, సెప్టెంబర17(ఆంధ్రజ్యోతి): కన్నడలో సూపర్‌హిట్‌గా నిలిచి,వంద రోజులు ప్రదర్శింపబడిన వీర చంద్రహాసను ఈనెల 19న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నామని చిత్ర నిర్మాత కొమ్ము జేమ్స్ వాట్ వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల షెల్టాన్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేమ్స్ వాట్ మాట్లాడుతూ గతంలో తాను నిర్మించిన ఆర్టిస్ట్ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని, త్వరలో ఈ చిత్రం ఓటిటి ప్లాట్‌ఫాంకు రానుందన్నారు. కన్నడంలో సూపర్ హిట్ అయిన వీర చంద్రహాసను,మన తెలుగు ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతె ఎంవీ రాధాకృష్ణతో కలిసి దీనిని తెలుగులో విడుదల చేస్తున్నామన్నారు. శివకుమార్ ప్రధానపాత్ర పోషించిన ఈ చిత్రంలో కేజీఎఫ్, సలార్ చిత్రాల్లో నటించిన నటులు కూడా కనిపిస్తారని అన్నారు.

అధ్యక్షా..



- నేటి నుంచే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- సభలో నియోజకవర్గ సమస్యల ప్రస్తావనకు సిద్ధమైన జిల్లా ఎమ్మెల్యేలు
- ఇప్పటికే ప్రశ్నోత్తరాలతోపాటు సమస్యల అంశాలు అందజేత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో సమస్యలను ఏకరువు పెట్టేందుకు జిల్లా ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని, ప్రజలను వేధిస్తున్న పలు కీలక సమస్యలు, అంశాలపై సభలో ప్రశ్నలు లేవనెత్తేందుకు సమాయత్తమయ్యారు. గత ప్రభుత్వంలో ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేసిన ప్రతిపాదనలు, అక్రమాలు, ఎన్నికల సమయంలోను ఇచ్చిన హామీలు నెరవేర్చేలా సభలో ప్రశ్నించడానికి ఎమ్మెల్యేలు సమాయత్తమయ్యారు. అటు ప్రశ్నోత్తరాలకు, సభలో ప్రస్తావించనున్న అంశాలకు సంబంధించి ఇప్పటికే శాసనసభ కార్యాలయానికి వివరాలు కూడా పంపించారు. ఈ మేరకు సభలో ప్రశ్నించాల్సిన, ప్రస్తావించాల్సిన జాబితాలు సిద్ధం చేసుకున్నారు. గురువారం నుంచి దాదాపు పదిరోజులపాటు జరగనున్న సమావేశాల్లో నియోజకవర్గాలకు కావలసిన నిధులు, పలు పనులకు అనుమతులు సాధించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా గత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు చాలా వరకూ అమలులోకి రావడంతోపాటు, అభివృద్ధి సంక్షేమాలతో జిల్లా ప్రజలు ముందుకు వెళుతుండడంతో ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారు. మరింత సంతృప్తికోసం, పలు ప్రజలకు ఉపయోగపడే పలు విషయాలను కూడా అసెంబ్లీలో ప్రస్తావించడానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంపుకోసం.. మంత్రి కందుల

జిల్లాలో వరి పంట ఎక్కువ. అందువల్ల రైతు పండించిన ధాన్యానికి సరైన మార్కెట్ ఉండాలి. దానికోసం జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంపు అవసరాన్ని సభ దృష్టికి తీసుకువెళతా. దానివల్ల రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులుండవు. ఇక ఎర్రకాలువ మోడరైజేషన్ పనులు వెంటనే చేయవలసిన అవసరం గురించి కూడా మాట్లాడతాను. జిల్లాలో టూరిజం ప్రాజెక్టు పనులు వేగవంతం గురించి కోరతాను.

చేనేత కార్మికులను ఆదుకోవడం కోసం.. ఎమ్మెల్యే గోరంట్ల

చేనేత కార్మికులు సమస్యలతో ఉన్నారు. నా దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చారు. ప్రత్యేక కార్పొరేషన్ కోసం కూడా అడిగారు. ఇవన్నీ సభ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తా. టిడ్కో ఇళ్లు అప్పగింత, వైసీపీ ప్రభుత్వం లబ్ధిదార్ల పేరిట రుణాలు తీసుకుంటే, వాటికి వాయిదాలు లబ్ధిదారులు కట్టాల్సివస్తోంది. వీటిని ప్రస్తావిస్తా.

సొసైటీల చట్టంలోని లోపాలు చర్చిస్తా.. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

1999 మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీల చట్టంలోని లోపాల వల్ల జయలక్ష్మి సొసైటీ వంటి అనేక సొసైటీలు ఖాతాదార్లను, డిపాజిటర్లను మోసం చేస్తున్నాయి. ఈ చట్టంలో లోపాలు సవరణ గురించి సభ దృష్టికి తీసుకుని వెళతా. టిడ్కో గృహాలను లబ్ధిదార్లకు వెంటనే అందివ్వాలని కోరతా. ముఖ్యంగా మహిళా అభివృద్ధి చైల్డ్ వెల్ఫేర్‌కు సంబంధించి 2005 నుంచి అమలులో ఉన్న కొత్త బాలికా సంరక్షణ పథకం పరిస్థితి ఏంటి, ఎంతమంది లబ్ధిదారులు, తిరిగి అమలు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఇప్పటికే ఒక ప్రశ్న నమోదు చేయించా.

మైనర్ లిఫ్ట్ఇరిగేషన్ నిర్వీర్యం, వాటి పునరుద్ధరణ కోసం.. నల్లమిల్లి

రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన లిఫ్ట్ ఇరిగేషన్, ఇతర ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. వాటి పునరుద్ధరణ, రిపేర్లకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటి పునరుద్ధరణ అవసరాలపై ఓ ప్రశ్న అడగనున్నా. ఇక అనపర్తిలోని జీబీఆర్ కాలేజీని 1978లో రైతులు తమ సొమ్ముతో నిర్మించారు. దాన్ని మేనేజ్మెంట్ సొంతం చేసుకుని రైతులకు సంబంధం లేకుండా చేసింది. దీనిపై విచారణ జరుగుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం సభ దృష్టికి తీసుకుని వెళ్లనున్నా. కాటన్ బ్యారేజీ రిపేర్లకు రూ.150 కోట్లు మంజూరయ్యాయి. దానికి అభినందించే తీర్మానం కూడా పెట్టే ఆలోచన చేస్తున్నా.

కొత్త పంచాయతీల ఏర్పాటు అవసరాన్ని ప్రస్తావిస్తా.. ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం నియోజకవర్గంలో కొన్ని పంచాయతీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. పర్యాటకపరంగా కొన్ని దేవాలయాల అభివృద్ధి, కోరుకొండ ఆలయానికి రోప్‌వే వంటివి ప్రస్తావిస్తా. గోదావరి పుష్కరాల సమయంలో ఘాట్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల గురించి కూడా ప్రస్తావిస్తాను.

గోదావరి పుష్కరాల్లో కొవ్వూరుకు ప్రాధాన్యత కోసం.. ఎమ్మెల్యే ముప్పిడి

గోదావరి పుష్కరాల సమయంలో కొవ్వూరు ప్రాంతంలో కూడా ఎక్కువ భక్తులు వస్తారు. అందువల్ల ఇక్కడ ఘాట్లు పెంచడం, మౌలిక సదుపాయాల గురించి ప్రస్తావిస్తాను. కొవ్వూరులో గోదావరి నీటిని మంచినీటిగా అందించాల్సిన అవసరం ప్రస్తావిస్తా.

ఎర్రకాలువ వరదనీటితో రిజర్వాయర్ నిర్మాణం కోసం.. ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం నియోజకవర్గంలో ఇరిగేషన్ సమస్య ప్రధానంగా ఎక్కువ ఉంది. వానలు బాగా పడినపుడు ఎర్రకాలువకు వచ్చిన వరదనీటిని నిల్వచేసి వినియోగించుకోవడానికి వీలుగా ఓ రిజర్వాయర్ నిర్మాణం కోసం సభ దృష్టికి తీసుకుని వెళ్లనున్నా. అదేవిధంగా నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన, ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం వంటి సమస్యలతో పాటు నిధుల కోసం సభలో ప్రస్తావించనున్నా.

గోదావరి పుష్కరాలు - 2027 పనులకు డీపీఆర్‌తో సిద్ధంకండి!

- రహదారులు, డ్రైనేజీ పనులు వేగవంతం చేయండి
- పంచాయతీలకు వచ్చే ఆదాయంతో అదే పంచాయతీల అభివృద్ధి
- అమృత్2.0లో రూ.290 కోట్ల నిధులు మంజూరు
- సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారాయణ.. చిత్రంలో కలెక్టర్ కీర్తి చేకూరి, రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027 పనులకు సంబంధించిన డీపీఆర్‌లతో ప్రభుత్వ శాఖలు సిద్ధం కావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన జరిగిన ప్రభుత్వశాఖల సమీక్ష సమావేశంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ సమీక్షలో మాట్లాడారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులపై, రాజమహేంద్రవరం అభివృద్ధిపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు, రవాణా, స్నానాల రేవుల అభివృద్ధి తదితర అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై సమగ్రంగా చర్చించారు. పుష్కరాల పనులకు ప్రభుత్వ శాఖలు డీపీఆర్‌లు సిద్ధం చేయాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్కరాల ప్రతిపాదిత పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. పుష్కరాలకు రూ.456 కోట్లతో రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

గ్రామ పంచాయతీలకు సంబంధించి వచ్చే ఆదాయం ఆయా గ్రామాల అభివృద్ధికే కేటాయించాలని మంత్రి నారాయణ చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న రహదారులు, డ్రైనేజీల పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. రాజమహేంద్రవరంలో 50.6 ఎంఎల్‌డీ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు 60 శాతం పూర్తిచేశారని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి దీనిని పూర్తిచేసుకుని మరో 5ఎంఎల్‌డీ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు డిసెంబరు నాటికి పూర్తిచేయాలన్నారు. అమృత్ 1.0లో రూ.82.16 కోట్ల పనులు చేపట్టి.. వాటిలో రూ. 37 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేశారని చెప్పారు. అమృత్ 2.0లో రూ.290 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులు టెండర్లు ఈ నెలాఖరునాటికి పిలిచి ఆయా పనులు రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులు సమగ్ర డీపీఆర్‌ను సిద్ధం చేస్తామన్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పుష్కరాలకు క్రౌడ్ మేనేజ్మెంట్, ఘాట్ల అభివృద్ధి, ట్రాఫిక్ మళ్లింపు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించామన్నారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టవలసిన పనులన్నింటినీ మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాజమహేంద్రవరంలో ఘాట్ల అనుసంధానం అభివృద్ధి, రహదారుల అభివృద్ధి, ఘాట్లకు అనుసంధానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాల్సివుందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం ఉన్న 8 ఘాట్లను తొమ్మిది ఘాట్లుగా అభివృద్ధి చేయాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం తర్వాత అత్యధికంగా భక్తులు పుణ్యస్నానాలు చేసేది కొవ్వూరులోనేనని చెప్పారు. గత ఐదేళ్లలో కొవ్వూరు ప్రాంతం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, గోదావరి పుష్కరాల పనుల్లో భాగంగా కొవ్వూరును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను మంత్రికి అందించానన్నారు. రుడా చైర్మన్ బొడ్డువెంకట రమణచౌదరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు.



కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే నల్లమిల్లి

మహోన్నతవ్యక్తి, ప్రపంచ సృష్టికర్త విశ్వకర్మ

జయంతి కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ స్వయంభూ, ప్రపంచ సృష్టికర్తగా పరిగణించబడిన మహోన్నత వ్యక్తి అని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి బి.శశాంక, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరెడ్డి, సహాయ బీసీ సంక్షేమాధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

- ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ సీహెచ్ కీర్తి, ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము హాజరు
- నేటి నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా వ్యాప్తంగా 421 ఆరోగ్య శిబిరాలు



సభలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

ధవళేశ్వరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలో తొలిసారిగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, కలెక్టర్ చేకూరి కీర్తి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని, అదే సమయంలో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ధవళేశ్వరం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేలా చూడడమే ఈ పథక లక్ష్యమన్నారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఈ పథకంలో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 421 ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా ఎన్‌సీడీ స్క్రీనింగ్, టీబీ గుర్తింపు, రక్తహీనత నివారణ, సికిల్ సెల్ స్క్రీనింగ్, గర్భిణీ ప్రసవానంతరం ఆరోగ్య పరీక్షలు, రోగ నిరోధక టీకాలు, రక్తదాన శిబిరాలు, పీఎంజేఏవై ఆయుష్మాన్ కార్డుల పంపిణీ వంటి సేవలు అందించనున్నట్టు తెలిపారు. తర్వాత గర్భిణీలకు పౌష్టికాహారం, పసుపు, కుంకుమ, పండ్లతో కిట్‌లను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహత్తర సేవ

మోదీ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన ఎంపీ పురందేశ్వరి



బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్నఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరి ప్రాణాలు కాపాడే మహత్తర సేవ అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి, రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో ఎంపీ పురంధేశ్వరి స్వయంగా రక్తదానం చేసి అందరికీ ప్రేరణ కల్గించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాజమండ్రి అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగబాబు, నాయకులు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, వీరా వీరాంజనేయులు, శెట్టిపల్లి శివ నాగరాజు, మోహిని, బండి ప్రసాద్, అడపా వరప్రసాద్, తగరం సురేష్, కురగంటి సతీష్, రవిశంకర్, డాక్టర్ ఉమా పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ..

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాజమహేంద్రవరం జీవకారుణ్య సంఘంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తుపై అవగాహన

రాజమహేంద్రవరం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఈగిల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్ఐలు, రైటర్లు, అసిస్టెంటు రైటర్లకు ఈగిల్ విభాగం ఇన్స్‌పెక్టర్లు జి.రవికుమార్, పీవీ సూర్యమోహన్‌రావు ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కేసు నమోదు నుంచి చార్జిషీటు దాఖలు చేసేవరకూ ఏ సమాచారాన్ని ఏవిధంగా రికార్డుచేయడం, ఎలా సీల్ చేయడం, మేజిస్ట్రేట్ దగ్గర ఇన్వెంటరీ సర్టిపై చేయించే విధానం, నమూనాల సేకరణ, ఎఫ్ఎస్ఎల్‌కి పంపడం, దర్యాప్తు పూర్తయిన తర్వాత సీజ్ చేసిన పదార్థాలను ధ్వంసం చేయడం వంటి అంశాలను వివరించారు. సిబ్బందికి ప్రాక్టికల్‌గా కూడా తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్ కీర్తి చేకూరిని బుధవారం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనవెంట ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, మద్దిపట్ల సురేష్, గెల్లా సురేష్, తదితరులు ఉన్నారు.

బయోలాజికల్ కంట్రోల్ లేబోరేటరీ పరిశీలన



కంట్రోల్ లేబోరేటరీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు

నిడదవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతాంగం బయోలాజికల్ కంట్రోల్ లేబోరేటరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్. మాధవరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బయోలాజికల్ కంట్రోల్ లేబోరేటరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయంలో జీవన ఎరువులను ప్రోత్సహిస్తుందని, రైతులు ఈ లేబోరేటరీ ద్వారా వాటిని పొందవచ్చునన్నారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు పీ.చంద్రశేఖర్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.కృష్ణ కిషోర్, పీ.దివ్య, జీ.సత్యనారాయణ, జీ.సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన శైలితో క్యాన్సర్ నివారణ

చాగల్లు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవన విధానంతో క్యాన్సర్‌ను నివారించవచ్చునని డాక్టర్ తనూజ అన్నారు. బుధవారం చాగల్లు మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు కేన్సర్‌కు సంబందించిన మరియు ఇతర వ్యాదులుపై స్క్రీనింగ్ పరిక్షలు నిర్వహించారు. మానశిక, శారీరక ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు, మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. చాగల్లు, నెలటూరు లయన్స్‌క్లబ్ సభ్యులు సహాయ సహకారాలుతో కూడిన సేవలు అందించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



పట్టణంలో స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు

నిడదవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత అందరి బాధ్యత అని, స్వచ్ఛత హీ సేవలో భాగంగా దీనిపై ప్రజలకు అవగాహన కోసం క్లీన్‌గ్రీన్ ఉత్సవ్ నిర్వహిస్తున్నామని మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ వచ్చేనెల 2వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ఏఈ హేమంత్, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం తాళ్లపూడి మండలానికి చెందిన ఇద్దరికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకు చెందిన మల్లవరపు శ్రీనివాస్‌కు రూ. 1,13,292, అన్నదేవరపేటకు చెందిన యంగల కొండమ్మకు రూ. 40,311 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, గెల్లా సురేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని నిమ్మలపాడుదిబ్బ వద్ద బుధవారం వినాయక నవరాత్రులు ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం పలు పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మంత్రి దుర్గేష్ జన్మదిన వేడుకలు

• పలుచోట్ల కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కూటమి నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విజ్జేశ్వరం నుంచి మంత్రిను భారీ ర్యాలీగా నిడదవోలుకు తీసుకువచ్చారు. అనంతరం ఆర్వోబీ వద్ద భారీ గజమాలను క్రెయిన్ ద్వారా వేసి పట్టణంలోకి స్వాగతం పలికారు. జనసేన పార్టీ గుర్తుతో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి కట్ చేశారు. తర్వాత మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, నిడదవోలు మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన నాయకులు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పెన్మెత్స చందు, పలు ప్రాంతాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణమంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పండగ వాతావరణం నెలకొంది. అలాగే మండలంలోనూ వేడుకలు జరిగాయి.



నిడదవోలులో మంత్రికి గజమాలతో స్వాగతం పలుకున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు



కొవ్వూరు పట్టణంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి



నల్లజర్లలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



దేవరపల్లిలో..

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం విషయంలో మోడల్ నియోజకవర్గంగా కొవ్వూరును తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టోలిగేటు సెంటరులో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన మహిళ, బలమైన కుటుంబాలే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్వస్థ నారీ సశక్త్ పరివార్ ప్రారంభించడం జరిగిందన్నారు. దీని ముఖ్య ఉద్దేశం మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, అర్జిల్లి రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, ఐసీడీఎస్ సీడీపీవో కె.నాగలక్ష్మి, డాక్టర్లు కె.ప్రణీత, ఎస్.ధర్మరాజు, సీహెచ్.థెరీసాపాల్, సీహెచ్ వెంకటేష్, సుమతి, నిహారిక, పృధ్వీ, అంగన్వాడీ, ఏఎన్ఎంలు, నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. బుధవారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, డాక్టర్ తెల్లం గంగాధర్, సిరాజ్ ఊద్దీన్, వైద్య ఉద్యోగుల సంఘ అధ్యక్షులు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలోనూ మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

తాళ్లపూడి: ప్రతి ఇంట్లో తల్లి ఆరోగ్యవంతురాలై ఉంటే ఆ కుటుంబం, సమాజమంతా ఆరోగ్యవంతంగా మారుతోంని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తాళ్లపూడి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసి స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో చేపట్టిన వైద్యశిబిరంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు 30 మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో యువగళం సభ్యులు కూచిపూడి గణపతి, సిద్దా దుర్గారావు, గన్నిన సత్తిబాబు, ఇండుగుల రామకృష్ణ, నామా నరేంద్ర(నాని), పోతుల గాంధీ, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీవో వేణుగోపాల రెడ్డి, తదితర వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్నదేవరపేటలోని పీహెచ్‌సీలో డాక్టర్ పీ. స్వర్ణలత, డా. నవ్యశ్రీ, డా. నిహారిక ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అల్లూరి విక్రమాదిత్య, కొఠారు వెంకట్రావు, జనసేననేతలు చెవ్వూరి బంగార్రాజు, కూచిపూడి గణపతి, వెలుగుబంటి బాలకృష్ణ, కవల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ఆరోగ్యమే మహాభాగ్యమని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లిలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌ను బుధవారం ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ అవేర్‌నెస్ డాక్టర్ ఎస్తేరురాణి, వైద్యాధికారి సంజీవ్‌కుమార్, సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్‌ఎంఎస్‌లు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మ అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



విజయవిహార్ సెంటర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



చాగల్లు సెంటర్‌లో కేక్ కటింగ్ చేసిన దృశ్యం



దేవరపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రరాజ్యంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ అన్నారు. బుధవారం ప్రధాని జన్మదిన వేడుకలను కొవ్వూరు పట్టణం, మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయవిహార్ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. రాధ మాట్లాడుతూ గత 11 ఏళ్లగా ప్రధానిగా ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, తాడిమళ్ళ విజయవాణి, మడిచర్ల రామచంద్రరావు, అడ్డూరి సత్యనారాయణ, కంకటాల రాం బాబు, గండ్రోతు పవన్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించినట్టు పార్టీ మండలాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పలువరు బీజేపీనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా, రాజకీయంగా శక్తివంతమైన దేశంగా అభివద్ధి పథంలో పయనిస్తోందని బీజేపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బి సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. చాగల్లు సెంటర్‌లో మోదీ పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్, మద్దిపాటి సురేష్, సౌందర్య, టీడీపీ సీనియర్ నాయకులు కరుటూరి సతీష్, తాళ్లూరి ప్రసాద్, కూటమి నాయకులు, బీజేపీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: నవ భారత ప్రధాని నరేంద్ర మోదీ అని మండల బీజేపీ అధ్యక్షుడు కోలా రామకృష్ణ, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు పేర్కొన్నారు. దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎస్.వెంకటేశ్, నిమ్మగడ్డ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్‌లు గుత్తికొండ శ్రీనివాస్, పుట్టా హరి ప్రసాద్, బీజేజీ నేతలు ఓరుగంటి వెంకట పతి రాజు, మందాజనార్దన్, ముప్పిడి భాస్కర్ కుమార్, శాలి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రణభేరి జాతకు యూటీఎఫ్ నేతలు

బిక్కవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన యూటీఎఫ్ రణభేరి జాతకు మండలం నుంచి యూటీఎఫ్ నేతలు, కార్యకర్తలు బుధవారం బయలు దేరారు. రెండోరోజు గోకవరం నుంచి బయలుదేరి కోరుకొండ, రాజానగరం మీదుగా రాజమహేంద్రవరం, కడియం మీదుగా మండపేట చేరుకుంటుంది. అందువల్ల బిక్కవోలు నుంచి యూటీఎఫ్ నేతలు సతీష్‌రెడ్డి, గోవిందరావు ఆధ్వర్యంలో 26 మంది నేతలు, కార్యకర్తలు రాజానగరం తరలి వెళ్లారు. అక్కడ నుంచి మండపేట వరకు జాతలో పాల్గొంటారు.



బిక్కవోలు నుంచి యూటీఎఫ్ రణభేరి జాతకు బయలు దేరిన నేతలు

నిడదవోలు, తాళ్లపూడిలో విశ్వకర్మ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న విశ్వకర్మ సంఘ సభ్యులు

తాళ్లపూడి, సెప్టెంబరు 147 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సూర్య భగవానుడు తన సొంత రాశి అయిన సింహరాశిని వదిలి కన్యరాశిలోకి ప్రవేశించే సమయంలో విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారు. వాస్తు శాస్త్రం, యాంత్రిక శాస్త్రం రంగంలో పనిచేసే వారికి ఈరోజు చాలా ప్రాముఖ్యమైనదిగా భావిస్తారు. ప్రక్కిలంక శివాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 150 మంది విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్నాల సతీష్, పట్నాల సూరిబాబు, కడలి కిరణ్ కుమార్. కాశీ ప్రసాద్, మహేష్, ముత్తేజు మురళి, కొసన శివ తదితర విశ్వ బ్రాహ్మణ సంఘ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో బుధవారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు గోలి రామబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి నాగోజు వీర సత్యనారాయణ, కోశాధికారి లావేటి జేజీ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రభుత్వ సహకారం

• ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము

కోరుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మానసికంగా కానీ, శారీరకంగా కానీ ఉన్నప్పటికీ వారిని ఇంటికే పరిమితం చేయకూడదని, వారిలో మార్పు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్రయత్నాలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే సోము వీర్రాజు పేర్కొన్నారు. కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ వద్ద బుధవారం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అనేక రకాలుగా ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం కృషి చేస్తుందన్నారు. ఎవరికైతే ఫిజియోథెరపీ అవసరం ఉంటుందో వారికి థెరపీ చేయించడం, పరికాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వారికి అన్నిరకాలుగా అండగా ఉంటుందని, వారికి సరైన ఉపాధి కల్పించాలన్నదే కూటమిప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను మనం సరిగాప్రోత్సహించినట్లు అయితే వారిలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలు బయటకు వస్తాయన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఒక అంధురాలు జిల్లా మొదటి స్థానంలో నిలవడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు అడపా సుధీర్‌కుమార్, రొంగల శ్రీనివాస్, తాటికొండ శ్రీను, అడ్డాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన సువర్ణరాజు

దేవరపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రి కందుల దుర్గేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన్ని బుధవారం రాజమహేంద్రవరంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో పార్టీ నాయకులు సీహెచ్ బాపిరాజు, కొత్తపల్లి హరిబాబు, ఆర్. నాగరాజు, యు.సత్య, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన పార్టీ నేత సువర్ణరాజు

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఊనగట్లలో ఎంపికైనవారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో భాగంగా అండర్ - 14 బాలుర విభాగంలో బొల్లా సూర్య వెంకట సందీప్ (8వ తరగతి), అండర్ - 17 విభాగంలో నల్లాకుల యశోదర్ (8వ తరగతి) ఉన్నారు. ఏలూరు ఏఎన్ఆర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా బుధవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావును సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీ రమణయ్య, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, ఎస్ఎంసీ ఛైర్మన్ కామన శివ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ స్వరూప్‌నకు అవార్డు ప్రదానం

దేవరపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఈ ఏడాది ఉత్తమ కంపెనీగా పరమేశ్వర బయోటెక్ ఫ్యాక్టరీ ఎంపికైంది. ఈ సందర్భంగా ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును ఎండీ ఆనంద్ స్వరూప్ మంత్రి టీజీ భారత్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని చేతులమీదుగా అందుకున్నారు. ఎండీ ఆనంద్‌స్వరూప్ మాట్లాడుతూ మొక్కజొన్న ఫ్యాక్టరీ ప్రతిష్టాత్మకమైన ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు 2025ను అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



మంత్రి టీజీ భరత్, ఎంపీ కేశినేని చిన్ని నుంచి అవార్డు అందుకుంటున్న ఆనంద్ స్వరూప్

నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడిగా వెంకటరమణ

నల్లజర్ల సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడిగా చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ జడ్పీటీసీ కొఠారి అనంతలక్ష్మి, పోతినీడుపాలెం సర్పంచ్ పిచ్చుకుల గణపతి, చీపురుగూడెం టీడీపీ అధ్యక్షులు చెల్లు పెద్దరామన్న, కూసంపూడి బుజ్జి, బేతిన దుర్గారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అల్లాడ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట రమణ

కూరగాయల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం



వాదాలకుంటలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గోపాలపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెరటితోటల్లో పెంచే కూరగాయల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. వాదాలకుంటలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.నాలుగు వేలతో సమకూర్చిన విత్తనాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో 150 కుటుంబాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కిచెన్‌గార్డెన్‌లో భాగంగా పెరటితోట పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు జొన్నలగడ్డ రాంబాబు, గడా జోగేంద్రప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అరుణ, శేషగిరి, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసునంటూ లారీ డ్రైవర్‌కు బెదిరింపు

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసునంటూ లారీ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మేడ్చల్ జిల్లా దూలపల్లికి చెందిన గాండ్ల సంతోష్ హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఐషర్‌వ్యాన్‌లో లోడు వేసుకుని రాజమహేంద్రవరం వైపు బయలుదేరాడు. కాగా 16వ తేదీ రాత్రి గోవర్ధనగిరిమెట్ట వద్ద గల జియో పెట్రోల్‌బంకు వద్ద వ్యాన్‌ను రోడ్డు పక్క ఆపి నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఏపీ39 డీఎల్ 0942 నెంబరు గల హోండాషైన్ బైక్‌పై సుమారు 50 సంవత్సరముల వయస్సు కలిగిన వ్యక్తి ఎస్ఐ డ్రెస్ వేసుకుని చేతిలో మ్యాన్‌ప్యాక్ పెట్టుకుని వచ్చి రోడ్డు పక్కన వ్యాన్ ఎందుకు ఆపావు. రికార్డు చూపించమని అడిగాడు. రికార్డు సరిగాలేదని డ్రైవర్‌ను బెదిరించాడు. ఈ క్రమంలో స్టేషన్‌కు పదా అని కొంతదూరం తీసుకువెళ్లి రూ. రెండు వేలు నగదు తీసుకుని డ్రైవర్‌ను వదిలిపెట్టి కొవ్వూరువైపు పారిపోయాడు. వ్యాన్ డ్రైవర్ సంతోష్ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.